



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
ఆగస్టు 29, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# జలవలయంలో రాష్ట్రం

**నీట మునిగిన కామారెడ్డి నగరం.. కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి.. అర్గొండలో 43.35 సెం.మీ అత్యధిక వర్షపాతం**



**11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా నమోదు**

**భారీ వర్షాలతో మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాలు అతలాకుతలం**

**పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు..అలుగు పారుతున్న చెరువులు**

**వరదలు, వర్షాలతో ముగ్గురు మృతి, ఆరుగురు గల్లంతు**

**జల దిగ్బంధంలో గ్రామాలు.. వందలాది మందిని కాపాడిన సహాయక బృందాలు**

**రహదారులను ముంచెత్తిన భారీ వరద..ముంపులో జాతీయ రహదారులు**

**కశ్మీర్ టు కన్యాకుమారి ఎన్‌హెచ్ 44కు కోతలు..రాకపోకలకు అంతరాయం**

**పలుచోట్ల కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. నిలిచిపోయిన రైళ్లు**

**అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష.. ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే**

**సహాయక చర్యల్లో కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ నేతలు**

హైదరాబాద్ : ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా కురిసిన కుంభవృష్టి కామారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించింది. జల ప్రళయాన్ని తలపిస్తూ.. బుధవారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం అర్గొండలో 24 గంటల్లో 43.35 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. 2023 జూలైలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో కురిసిన 64.9 సెంటీమీటర్ల తర్వాత ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. అటు మెదక్, నిర్మల్ జిల్లాలను కూడా వాన ముంచెత్తింది. సిద్దిపేట, సిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలను సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. కన్యాకుమారి – కశ్మీర్ నేషనల్ హైవే 44 సహా పలుచోట్ల ప్రధాన రహదారులు కోతకు గురికావడం, అనేకచోట్ల వంతెనలు, కాజ్‌వే లు కొట్టుకు పోవడంతో పట్టణాలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వందేళ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టును వరద ముంచెత్తగా డ్యామ్‌కు ఒకవైపు గుంత పడటంతో ఒకదశలో ప్రాజెక్టు తెగిపోతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. ముందుజాగ్రత్తగా మూడు గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. మరోవైపు ఎన్నడూ లేనివిధంగా ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. రైల్వే ట్రాక్‌లు సైతం కోతకు గురి కావడంతో పట్టాలు వరదలో తేలుతున్నట్టుగా కన్పించాయి. వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు మరణించగా, ఆరుగురు గల్లంతయ్యారు. రాష్ట్రంలో వర్షాలు వరదల పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కుండపోతగా కురిసిన వర్షంతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. కాలనీల్లో ఇళ్లు నీట మునిగాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో జిల్లాలోని 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వేలాది మంది వరద ముంపుబారిన పడ్డారు. జాతీయ రహదారులతో పాటు జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒకరు గల్లంతయ్యారు. రాజంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గోడ కూలి ఇప్పకాయల పల్లె దవాఖాన వైద్యుడు వినయ్ (28) ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లిన బీబీపేట మండలం జనగామకు చెందిన రైతు రాజిరెడ్డి (63) ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యాడు. గురువారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. బీబీ పేట మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన బాలరాజు వరదలో గల్లంతవగా ఆయన ఆచూకీ దొరకలేదు. జిల్లాలోని బీబీ పేట చెరువుకు గండిపడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆరు ఎస్‌డీఆర్‌ఎస్ బృందాలు 25 చోట్ల రెస్క్యూ చేసి 775 మందిని కాపాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెతుకుసీమ కకావికలమైంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతిభారీ వర్షాలు

(మిగతా 2వ పేజీలో)



# గోదావరి మళ్లీ ఉగ్రరూపం

**ఉపనదులకూపోటెత్తిన వరద.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు2 లక్షల క్యూసెక్కుల వరద**

**ఎల్లంపల్లికి 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**రేపు మేడిగడ్డ బరాజ్‌కు 9.5లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద**

**జైక్వాడ్ నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత**





## సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నా ముందస్తు ప్రణాళికలు, సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫల మైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు విమర్శించారు. సహాయక చర్యల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని.. బాధితులకు అండగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువా రం పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వ హించి జిల్లాలవారీగా వరద నష్టంపై ఆరా తీశారు. జనజీవనం అస్తవ్యస్తంపై కేసీఆర్ ఆందోళన భారీ వర్షాలు, వరదలతో రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు కలగడం, జనజీవనం అస్తవ్యస్తం కావడంపై మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వరదలతో ఇళ్లు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలం కావడంపై దిగ్భ్రాంతి చెందారు. వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలతో గురువారం ఫోన్‌లో మాట్లాడారు. తమ వంతుగా పార్టీ శ్రేణులు సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని కేటీఆర్‌ను ఆదేశించారు.

# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

**వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులను పునరుద్ధరించాలి**

అందుకోసం వెంటనే అంచనాలు తయారు చేయండి

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించండి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

మెదక్, కామారెడ్డి జిల్లాల వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే

వరదలపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష



# జలవలయంలో రాష్ట్రం



నమోదయ్యాయి. ముఖ్యంగా హవేలీ ఘన్‌పూర్ మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ నుంచి రాజుపేట వైపు వెళ్తున్న ఓ ఆటో గంగమ్మ వాగులో కొట్టుకుపోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న రాజుపేటకు చెందిన బెస్త సత్యనారాయణ మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన యాదగౌడ్ ఆచూకీ ఇంకా లభించలేదు. వాస్తవానికి వీరిద్దరు వాగులో ఉన్న ఓ చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే వరద ఉధృతికి వీరు కొట్టుకుపోయారు. మరోవైపు ఇదే మండలంలోని నక్కవాగులో ఓ కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న నరేందర్‌గౌడ్ ఓ పొదను పట్టుకుని 100కు ఫోన్ ద్వారా లొకేషన్ పంపడంతో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. గంగమ్మ వాగుపై రాజుపేట బ్రిడ్జిపై 8 మంది చిక్కుకుపోగా, వీరిని కూడా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి.

దూప్‌సింగ్ తండాను వరద నీరు ముంచెత్తింది. నిజాంపేట మండలం చల్మెడలోని సోమయ్య చెరువు, బ్రాహ్మణ చెరువు నిండిపోయి గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో చెరువు కట్టకు గండి పెట్టి నీటిని దిగువకు వదిలేశారు. కొల్చారం మండలంలోని తుక్కాపూర్‌లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిన టేక్మాల్ మల్లప్ప భార్య ప్రమీల మంజీర నదిలో గల్లంతయ్యింది. గురువారం మధ్యాహ్నం వరకు అందిన వివరాల ప్రకారం..జిల్లాలో 49 రోడ్లు తెగిపోయాయి. 24 కాజ్‌వేలు, కల్వర్టులు కూలిపోయాయి. 21 బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 22 చెరువులకు గండ్లు పడ్డాయి. మెదక్, రామాయంపేట పట్టణాలతో పాటు, పలు గ్రామాల్లో 20 కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. 6,341 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

### జలదిగ్బంధంలో రామాయంపేట

రామాయంపేటలో రెండురోజుల్లో 20 సెం.మీ వరకు వర్షం కురిసింది. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, అక్కలగల్లి, బీసీ కాలనీ ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రామాయంపేట - కామారెడ్డి- సిద్దిపేట మార్గంలో వరద నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సీ మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్లో నీరు చేరడంతో 50 మంది విద్యార్థినులను తాళ్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు.

### రైతులు, ఇటుక బట్టీ కార్మికుల రెస్క్యూ

మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు బుధవారం వరద పోటెత్తింది. రికార్డు స్థాయిలో వచ్చిన నీటితో మానేరు పరవళ్లు తొక్కుతోంది. దిగువన ఉన్న పరీవాహక వాగులో ఒక రైతు గల్లంతు కాగా.. ఐదుగురు రైతులు, ఇద్దరు ఇటుక బట్టీ కార్మికులు ప్రవాహంలో చిక్కుకున్నారు. గురువారం భారత వైమానిక దళ హెలికాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. గేదెల కోసం వెళ్లిన గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య అనే రైతు వరదలో గల్లంతయ్యాడు. నర్మాలకు చెందిన పలువురు రైతులు పశువులను తోలుకెళ్లి వాగులో చిక్కుకుపోయారు. అదే ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు కార్మికులు అక్కడే ఉండిపోయారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గీతే వరదలో చిక్కుకుపోయిన వారికి డ్రోన్‌ల ద్వారా ఆహార పదార్థాలు పంపించారు.

### బండి సంజయ్ చొరవ

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో భారత వైమానిక దళానికి చెందిన హెలీకాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను ఒడ్డుకు చేర్చారు. గురువారం సంఘటన స్థలానికి చేరుకున్న సంజయ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఎగువ మానేరుకు వచ్చి వరద ఉధృతిని పరిశీలించారు. మధ్యాహ్నం ఆర్మీ హెలీకాప్టర్లు బాధితులను రక్షించేంతవరకు ఆయన ఘటనాస్థలంలోనే ఉండటం గమనార్హం. కాగా వరదలో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య నివాసానికి సంజయ్ వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగం కుమారుడు సాయికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

### నీటమునిగిన నిర్మల్

నిర్మల్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు భారీ నుంచి అతిభారీ వర్షం కురిసింది. నిర్మల్ పట్టణంలో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో మునిపల్లి శివారులోని గోదావరి కుర్రులో చిక్కుకుపోయిన పశువుల కాపరి శంకర్‌ను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద రోడ్డు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో సుమారు 24 గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

### తెగిన ఎన్‌హెచ్- 44..

కశ్మీర్ టూ కన్యాకుమారి ఎన్‌హెచ్-44 పై పలుచోట్ల రోడ్డు, వంతెనలు తెగిపోవడంతో జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నార్సింగి వద్ద వరద 44వ నంబర్ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. దీంతో హైదరాబాద్ - నిజామాబాద్ మార్గంలో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ - సిద్దిపేట రహదారిపై నిజాంపేట వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో ఈ రూట్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ రహదారిపై పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహించడంతో వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కామారెడ్డి-భిక్కనూరు మండలాల సరిహద్దులో జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వచ్చిన వరద నీటితో రోడ్డు కోతకు గురైంది. సదాశివనగర్ మండలం కల్వరాల వద్ద కూడా ఎన్‌హెచ్ 44 కోతకు గురైంది. టేక్రియల్ వంతెన కోతకు గురైంది. హైదరాబాద్-నిజామాబాద్ ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి.

### కొట్టుకుపోయిన రైల్వే లైన్లు

సికింద్రాబాద్-నిజామాబాద్ రైల్వే లైనుపై పలు చోట్ల మట్టికొట్టుకుపోయి ట్రాక్‌లు గాలిలో వేలాడడంతో రైళ్లను రద్దు చేశారు. మెదక్ జిల్లా శమ్‌నాపూర్ దేవుని చెరువు నీళ్ల ధాటికి రైల్వే ట్రాక్ కోతకు గురైంది. దీంతో అక్కన్నపేట - మెదక్ మార్గంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా తలమడ్ల సమీపంలో కూడా ట్రాక్ కోతకు గురికావడంతో సికింద్రాబాద్- మన్మార్డ్ మా ర్గంలో రైళ్లు నిలిచిపోయాయి. ఈ రూట్లో రైళ్లు పునరుద్ధరించాలంటే రెండు రోజులైనా పట్టే అవకాశాలున్నాయని అంటున్నారు.

### భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో..

భూపాలపల్లి జిల్లా ఎగువనుంచి వరద నీరు వస్తుండటంతో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి, కేశవపూర్ మధ్య గల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ మల్హార్ మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, భూపాలపల్లి ఏరియాలో మంగళవారం, బుధవారం కురిసిన వర్షానికి ఓపెన్‌కాస్ట్ 2,3 ప్రాజెక్టుల్లో 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ములుగు జిల్లా మొండ్యాల తోగు వద్ద జాతీయ రహదారి వరద తాకిడికి భారీగా కోతకు గురైంది. ఊరట్టం తూ ముల వాగు వరద తాకిడికి బ్రిడ్జి సమీపంలో రోడ్యాం వద్ద సీసీ రోడ్డు కోతకు గురైంది. రంగాపూర్ పెద్ద చెరువు కట్ట తెగిపోయింది.

### జల దిగ్బంధంలో సిద్దిపేట

రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సిద్దిపేట జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఎగువ నుంచి కోమటి చెరువుకు వరద నీరు చేరడంతో పొంగి పొర్లుతోంది. దీంతో పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, హరిప్రియానగర్, శ్రీనివాసనగర్, సీతారామంజనేయ థియేటర్ జలమయంగా మారాయి. హరిప్రియానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వరద నీరు చేరడంతో..వరద ప్రవాహంలోనే రోగులను స్ట్రెచర్‌పై మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్న కాలనీ, ఎలైట్ ప్రజ్వల్ కాలనీ కూడా నీట మునిగాయి. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గజ్వేల్-దుబ్బాక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట పొంగి పొర్లుతుండటంతో వరద నీరంతా తూప్రాన్ రోడ్డు వై జంక్షన్ వద్ద నిలిచి 33/11 కేవీ సబ్ స్టేషన్ జలమయంగా మారింది. వరద ముంపులో చిక్కుకున్న సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు 22 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవ ద్వారా వారిని ఒడ్డుకు చేర్చారు.

### పోచారం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్టుకు భారీ ముప్పు తప్పింది. భారీ వర్షాలతో ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు పైభాగం నుంచి నీరు పడడంతో స్ట్రక్చర్‌కు ఒకచోట గొయ్యి ఏర్పడింది. ప్రాజెక్టు తెగిపోయినట్టేనని అందరూ భావించారు. కానీ వరద తీవ్రత తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### రైలుకు ఎదురెళ్లి నిలిపేసిన గ్యాంగ్‌మన్

గ్యాంగ్‌మన్ అప్రమత్తతతో పెద్ద రైలు ప్రమాదం తప్పింది. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి-తిప్పాపూర్ మధ్య 528 మైలురాయి వద్ద రైల్వే ట్రాక్ కింద ఉన్న మట్టికట్ట 50 గజాల మేర కొట్టుకుపోయింది. దీంతో రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. గ్యాంగ్‌మన్ రమేష్ దీన్ని గమనించి అప్రమత్తమయ్యాడు. భిక్కనూరు నుంచి వస్తున్న కాచిగూడ-పెద్దపల్లి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి అది ఆగిపోయేలా చూశాడు. ట్రాక్ కొట్టుకుపోయిన విషయాన్ని లోకో పైలట్‌కు తెలియజేయడంతో ఆయన స్టేషన్ మాస్టర్ భానుశేఖర్‌కు సమాచారం అందించారు. ఆయన ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతో వారు వెంటనే సికింద్రాబాద్-నిజామాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసి, కొన్ని రైళ్లను వేరే మార్గంలోకి మళ్లించారు. కాచిగూడ-పెద్దపల్లి ప్యాసింజర్ రైలులో 167 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరగకుండా వీరిని కాపాడిన గ్యాంగ్‌మన్ రమేష్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్, ప్రయాణికులు అభినందించారు.

# గోదావరి మళ్లీ ఉగ్రరూపం

భీకర వరద పోటెత్తడంతో అప్రమత్తత ప్రకటించారు. మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు నుంచి ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ వరకు పరీవాహకంలోని అన్ని ప్రాజెక్టుల గేట్లు పైకి ఎత్తారు. భద్రాచలం వద్ద గోదావరిలో 7.45 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో నీటిమట్టం 38.6 అడుగులకు చేరుకుంది. ప్ర వాహం 9.32 లక్షల క్యూసెక్కులకు చేరితే తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మంజీరపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకు 44,650 క్యూసెక్కుల వరద వస్తుండగా, 18.32 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 1.81లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 16.14 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 27 గేట్లు పైకెత్తి 2.2 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకు 3.2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 67.05 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 39 గేట్లు పైకెత్తి 3.55 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నెల 30న శ్రీరాంసాగర్‌కు గరిష్టంగా 3.7లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తనుందని అంచనా వేశారు. కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 66,605 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 3.78 టీఎంసీల నిల్వ కొనసాగిస్తూ, 62,407 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. స్వర్ణ ప్రాజెక్టులోకి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో అదేస్థాయిలో రెండుగేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 17,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో మూడుగేట్ల ద్వారా 18,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దిగువన ఉన్న ఎల్లంపల్లి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 5.14 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 14.63 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 38 గేట్లు పైకెత్తి 5.9 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సోమవారం రాత్రి నాటికి 9 లక్షల క్యూసెక్కులకు వరద పెరుగుతుందని అంచనా వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల బరాజ్‌కు 8.36 లక్షలు, అన్నారం బరాజ్‌కు 6.19 లక్షలు, మేడిగడ్డ బరాజ్‌కు 5.52 లక్షల క్యూసెక్కులతోపాటు సమ్మక్క బరాజ్‌కు 5.13 లక్షలు, సీతమ్మసాగర్ బరాజ్‌కు 7.02 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. మేడిగడ్డ బరాజ్‌కు శనివారం నాటికి గరిష్టంగా 9.48 లక్షల క్యూసెక్కుల వరద రానుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం మంగళ, బుధవారాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి పెరగనున్నట్టు అంచనా వేస్తున్నారు.

### మిడ్‌మానేరు గేట్లు ఎత్తివేత..

భారీ వర్షాలతో మానేరు నది పోటెత్తింది. దీంతో మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు మానేరు నుంచి 45,565 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా మరో 12,000 క్యూసెక్కులు కలిపి మొత్తం 57,566 క్యూసెక్కులు వచ్చి మిడ్‌మానేరులో కలుస్తుండడంతో జలాశయ 17 గేట్లను పైకెత్తి 47,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ మానేరు జలాశయానికి వరద ప్రవాహం 56,944 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం నిల్వ సామర్థ్యం 24.07 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.97 టీఎంసీలకు నిల్వలు చేరాయి. మంగళవారం ఉదయం నాటికి జలాశయం పూర్తిగా నిండొచ్చు.

### సాగర్‌కు పెరిగిన వరద .. 26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్/డిండి: సాగర్ జలాశయానికి 3,18,791 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 26 క్రస్ట్ గేట్లు, విద్యుదుత్పాదనతో దిగువ కృష్ణానదిలోకి 2,35,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఆయకట్టుకు నీటి అవసరాలు తగ్గాయి. దీంతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. అవసరమైన సమయంలో మళ్లీ నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### అలుగు పారుతున్న డిండి ప్రాజెక్టు

డిండి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులోకి వరద మరింత పెరిగింది. ఈ నెల 14 నుంచి ప్రాజెక్టు అలుగుపోస్తున్న విషయం తెలిసిందే. అయితే గురువారం నుంచి ప్రాజెక్టులోకి 10,202 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో అలుగు నుంచి నీటి విడుదల కూడా పెరిగింది. డిండి ప్రాజెక్టు అందాలను చూడటానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

## వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులను పునరుద్ధరించాలి

హైదరాబాద్ : భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తక్షణ మే అంచనాలు తయారు చేసి అత్యవసర నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వరదలతో అతలాకుతలమైన కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. భారీ వర్షాలతో బుధ, గురువారాల్లో పోటెత్తిన వరదలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలో అపార నష్టం వాటిల్లిందని సీఎంకు రెండు జిల్లాల కలెక్టర్లు నివేదించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద హెలికాప్టర్ దిగి వరదల పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులను ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలో హెలికాప్టర్ దిగి జిల్లా కలెక్టర్‌తో సమీక్షించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవటంతో సాధ్యం కాలేదు. దీంతో మెదక్ జిల్లా చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్‌ను మెదక్ ఎస్పీ కార్యాలయంలో దించి జిల్లాలో వరదల పరిస్థితిపై అక్కడే సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరద పరిస్థితిని కలెక్టర్ సీఎంకు నివేదించారు. వరద సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం బాగా పని చేసిందని సీఎం కితాబిచ్చారు. సమీక్షలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. మెదక్ నుంచే సీఎం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వరద పరిస్థితులపై ఆరా తీశారు. సత్వరం సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవా లని సీఎం ఆదేశించారు. గురువారం ఉదయం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కతో కలిసి వరద పరిస్థితిపై సమీక్షించారు. హైదరాబాద్ నగరంతోపాటు అన్నిచోట్లా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతోపాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌బృందాల సాయం తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు.

# భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం

**నిమజ్జనాల ఏర్పాట్లపై ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలి**

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి: భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి నియోజకవర్గంలోని వినాయక నిమర్జన ఏర్పాట్లపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయితీరాజ్, పోలీస్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రిసిటి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ వీరా రెడ్డి, లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో కృష్ణా రెడ్డి పాల్గోన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వినాయక నిమర్జనాల ఏర్పాట్లపై ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని, ఎలాంటి సమస్యలున్న వెంటనే పరిశ్కరించాలని అధికారులకు సూచించారు.అనంతరం భువనగిరి పెద్ద చెరువును అధికారులతో, ఉత్సవ సమితి సభ్యులతోపరిశీలించారు.యువత నిమార్జనాలలో భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా తగు జాగ్రత్త వహించాలని తెలిపారు

# అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎం.లావణ్యరాణి

**స్వాగతించిన బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది**





మిర్యాలగూడ, ఆగస్టు 28:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ కోర్టు సముదాయంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎం.లావణ్యరాణి భాద్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్యనారాయణ, కార్యదర్శి అలుగుబెల్లి భూపతి రెడ్డి పుష్ప గుచ్చాలందించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుండి శ్రీనివాస్, ట్రెజరర్ గొడ్డేటి సాయి కుమార్ యాదవ్, కొంకా వెంకన్న, గంగభవాని, కర్ణం లింగయ్య, బాలునాయక్ లున్నారు. అదేవిధంగా జడ్జి లావణ్యరాణి భాద్యతలు స్వీకరించిన సందర్భంగా కోర్టు సూపరింటెండెంట్ మెండు విద్యాసాగర్ రెడ్డి పుష్ప గుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, కిరణ్, వేళంగిని, సౌందర్య, మౌనిక, కమలాకర్, సుగుణమ్మ, రామకృష్ణ, నిర్మల, పారిజాత పాల్గొన్నారు. నెల క్రితం వరకు ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బిఎస్ఎన్ సుమాబాల గుంటూరు జిల్లా బాపట్లకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో లావణ్య వచ్చారు.

# భారీ వర్షాలు వరద ప్రవాహాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 28 : జగిత్యాల జిల్లాలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని, ఈ వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కలెక్టర్ గురువారం రాయికల్ మండలంలోని రామాజీపేట-భూపతిపూర్, రాయికల్-ఇటిక్యాల, రాయికల్-మైతాపూర్ గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జిలను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని బ్రిడ్జిలు వాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు, వరద ప్రవాహాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జీల వద్దకు ప్రజలు వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణాలు చేయకూడదని సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తమ కార్య స్థానాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందించాలని ఆదేశించారు. వర్షాలు, గాలులు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు తాకకూడదని, కరెంటు ప్రమాదాల నుండి రక్షణ కోసం అందరూ సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బింగి చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎస్సై సుధీర్ రావు, నీటిపారుదల శాఖ డి ఈ భాస్కర్, ఏ ఈ వినయ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ నవీన్, ఆర్ఐ పద్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 28 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు ఎవరు రావద్దని జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ అన్నారు. గురువారం రాయికల్ మండలంలోని రామాజీపేట- భూపతిపూర్ గ్రామాల మధ్యలోని వాగు అకాల వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయంగా ఉండటంతో స్థానిక నాయకులతో కలిసి వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కరెంటు స్తంభాలు కరెంటు వైర్లను ముట్టుకోవద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, పట్టణ అధ్యక్షుడు అనిల్, కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఎనుగందుల ఉదయశ్రీ, మరంపెల్లి రాణి సాయికుమార్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, నాయకులు దుగ్యాల రమాపతిరావు, ప్రశాంత్ రావు, కోల రాజు, సంతోష్ రావు, సత్యంరావు, అంబాల రాము, నర్సయ్య, రవీందర్ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ డివిజన్‌లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ**





మిర్యాలగూడ, ఆగస్టు 28:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ డివిజన్ లో వినాయక చవితి పండగ ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణం, గ్రామాల్లో ప్రతి వీధిలో గణేష్ మండపాలు వెలిసాయి. కొన్ని చోట్ల విగ్రహాల తయారు, అమ్మకం కేంద్రాల నుండి మేళతాళాలతో విగ్రహాలు తీసుకువచ్చి, కొంతమంది మంగళవారం నాడే తీసుకు వచ్చి ప్రతిష్టహించారు. అడుగు నుండి 30 అడుగుల ఎత్తున్న ఉన విగ్రహాలు రకరకాలుగా చిత్రించినవి, ఛత్రపతి శివాజీ వినాయకుని ముందు నిల్చున్నట్టు తయారు చేశారు. చిన్నవి ఒక అడుగు నుండి 5, 10, 15, 20 అడుగుల విగ్రహాలను 300 రూపాయల నుండి రూ.40,000ల ధరలకు విక్రయించారు. గత కొన్ని సంవత్సరాలుగా తయారిదారులైన రాజస్థాన్ రాష్ట్రనికి చెందిన విక్రయించగా ఈ ఏడాది స్థానిక సిక్కులే అమ్మకాలు చేశారు. పట్టణంలోని ఈదులగూడలోసుమారు 20 అడుగుల ఎత్తైన వినాయకుడిని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అదేవిధంగావినాయక చవితి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలు, వార్డులలో సిద్దివినాయకులను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు సమర్పించారు. మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సొంత తండాలో గణేష్ ఉత్సవాలలో పాల్గొని తండా, రాష్ట్ర ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గణనాథుడికి ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీతారాం, మత్రు, రామవత్ సైదా, రవి, మత్రు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆయా మండపాల్లో డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు, హిందు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, గంధం రామకృష్ణ, కొమ్మన నాగలక్ష్మి, వంగాల నిరంజన్ రెడ్డి, పాతూరి ప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్లు తిరునగరు భార్గవ్, నాగలక్ష్మి, గుడిపాటి సైదులుబాబు, అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొందు పార్వతిలు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ సహకారం తో మృతుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేత

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన చెరుకుపల్లి మల్లయ్య కొద్దిరోజుల క్రితం మరణించగా నిరుపేద కుటుంబం కావడంతో నేడు ఆయన దశదిన కర్మ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సహకారంతో మృతుని కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం,నాయకులు పాశం కృష్ణ,రాసాల వెంకటేష్ సాగర్, గుండమల్ల సతీష్,చిలువేరు శంకర్,శికిలమెట్ల ప్రభాకర్,పెరా రమేష్,జనగాం నర్సింహ్మా, వడ్డేపల్లి రాములు,మందుగుల సాయికిరణ్, బి జె ఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి గణపతి పంపిణీతో చైతన్యం కలిగిస్తున్న కస్తూరి ఫౌండేషన్ ఎస్సై జగన్

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 28( వార్త మిర్రర్): నారాయణపూర్ మండల కేంద్రంలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై జగన్ హాజరై, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ గారు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే క్రమంలో మట్టి గణపతి విగ్రహాల వినియోగం అత్యంత అవసరం. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్న కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం. భవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని చాటి చెప్పే ఈ ప్రయత్నం అందరికీ ఆదర్శం కావాలిఅని తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి, పర్యావరణహిత ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ ప్రతినిధులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్, గంగాపురం సాయి గౌడ్ , చిలువేరు సైదులు, ఎలిజాల శీను , కొల్లూరినవీన్ , నాగరాజ్,షరీఫ్,పల్చం శివ,ఉదయ్,భాను,ప్రభాకర్,రవి, స్థానికులు,యువత భారీగాపాల్గొన్నారు.



# ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం

**- ఉప్పల ట్రస్ట్ చైర్మన్.. ఉప్పల వెంకటేష్**

కల్వకుర్తి ఆగస్టు 28 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ నగర్ చెందిన నిరుపేద వైశ్య కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో పూర్తిస్థాయి ఇండ్లను నిర్మించడంలో భాగంగా స్లాబు (చెత్తూ) ఇండ్లుకు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణస్తులు కల్వకుర్తి పట్టణానికి చెందిన శివ వసంత - స్వామి గుప్తా మరియు వేముల పార్వతమ్మ వారు ఉప్పల వెంకటేష్ కి రుణపడి ఉంటామని,వెంకటేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.



# హౌసింగ్ బోర్డు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**సిపిఎం ఆధ్వర్యంలో అధ్యయనం**

మిర్యాలగూడ, ఆగస్టు 28:-( వార్త మిర్రర్)

పట్టణంలోనీ హౌసింగ్ బోర్డు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలనీ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో అధ్యయన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని గుంతలలో వర్షపు నీరు నిలిచాయన్నారు రు. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని మురికి నీరంత రోడ్లపై వచ్చి చేరుతుందన్నారు. రాత్రి వేళ వీధిదీపాలు వెలగడం లేదని అంధకారంలో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంతోమంది పేదలు పెన్షన్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి మణుల అరుణ, నాయకులు కరిమున్నిసా, మణెమ్మ, మున్నీ, వెంకట్ రెడ్డి, ప్రమీల పాల్గొన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం మద్యం టెండర్లలో గౌడులకు 25% వాటా కల్పించాలి

### బిజెపి నేత డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం మద్యం టెండర్లలో గౌడ కులస్తులకు25% వాటా కల్పించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్ అన్నారు.యాదాద్రి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ప్రతినిధితో మాట్లాడుతూ గత ప్రభుత్వం గౌడ కులస్తులకు మద్యం దుఃఖణాలలో 15 శాతం కటాయించిందాన్నారు. కామారెడ్డి లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మేనిపెస్టోలో గౌడులకు మద్యం దుఃఖణాలా కేటాయింపులలో 25 శాతం ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు.కామారెడ్డి డిక్లరేషన్ లో గౌడ్స్ కు ఇచ్చిన హామీ ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన విధ్వంసం వల్ల రాబోయే టెండర్లలో గౌడులకు అన్యాయం జరిగే అవకాశం ఉందాన్నారు.కామారెడ్డి లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రకారంగా 25 శాతం వాటా డిక్లరేషన్ విస్మరించడం సరికాదన్నారు. మద్యం టెండర్లలో 3 లక్షలు కాకుండా 2 లక్షలు కుదించాలని డిమాండ్ చేశారు డాక్టర్ మల్లేష్ గౌడ్



## రెండవ రోజు ఘనంగా గణనాధునికి పూజలు

వార్త మిర్రర్, మల్కాజిగిరి:

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలోని దయానంద్ నగర్ లో సిద్ధి వినాయక ఫ్లాట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద ప్రముఖ సంఘ సేవకులు శ్రీనివాస్, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల వలన ప్రజలలో భక్తి భావం పెంపొందుతుందని తెలిపారు. వినాయక నవరాత్రులు ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భబితా, భవాని, రాధిక, దీప, పద్మ, రమ్య, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కోసం రైతుల అరిగోస

కల్వకుర్తి ఆగస్టు 28 వార్త మిర్రర్ ప్రతినిధి:-యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి మండలంలో గురువారం యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట బారులు తీరారు.ప్రాథమిక సహకార సంఘానికి మూడు లారీల యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో కాసేపు తోపులాట చోటు చేసుకుంది. నాలుగు రోజుల నుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నామని, అయినా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో అవి సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పొలం పనులు వదిలి యూరియా కోసం పడిగాపులు

**- రోజంతా నిల్చుంటే దక్కేది ఒకటీ రెండు బస్తాలే**

**- రాష్ట్రంలో కొనసాగుతున్న యూరియా కష్టాలు**

**- బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**



కల్వకుర్తి ఆగస్టు 28 వార్త మిర్రర్ ప్రతినిధి:-కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా కోసం అన్నదాతల కష్టాలు కొనసాగుతున్నాయి. ఎదుగుతున్న పంటలకు అదును దాటక ముందే ఎరువు వేయాల్సి ఉండటంతో యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులు వదిలి యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జనం కిక్కిరిసిపోతుండటంతో యూరియా దొరుకుతుందో లేదోనని తెల్లవారుజాము నుంచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. నిలబడే సత్తువ కూలిపోయి చెప్పులు, ఆధార్ కార్డులను, క్యూలైన్ లో ఉంచుతున్నారు. నిల్చుంటున్నారు.అయితే రోజంతా ఎదురుచూసినా కేంద్రంలో ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే అందుతున్నాయి. లైన్లో ఉన్నా కొందరికి అవి కూడా దొరకడం లేదు.దీంతో అన్నదాతలు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న రోడ్ల పై నిల్చోవడం సమంజసం కాదని ప్రభుత్వం స్పందించి రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.



## వినాయకుని పూజలో పాల్గొన్న జెనిగల మహేష్ యాదవ్ దంపతులు

కల్వకుర్తి ఆగస్టు 28 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం ఎక్కయిపల్లి గ్రామంలో హనుమాన్ యూత్ గణేష్ కమిటీకి గణేష్ విగ్రహాదాత బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జేనిగలా మహేష్ యాదవ్ దంపతులతో వినాయక చవితి రెండో రోజు పర్వదిన సందర్భంగా గురువారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.వినాయక స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో రైతులందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నవీన్ సురేష్ అర్జును రాజేష్ రాకేష్ శివ రాఘవేందర్ విగ్నేష్ మల్లేశు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## బాలాపూర్ భారీ గణనాథుడి సన్నిధిలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 28 .. రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజ కవర్గంలో బాలాపూర్ లో ని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాలాపూర్ గ్రామంలో ప్రతిష్ఠిం చిన భారీ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వ హించిన లిమాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల యువకిశోరం కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ గణనాథుడి సాక్షిగా తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషా లతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను అని పేర్కొ న్నారు. అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. .ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి, ఒంగేటి లక్ష్మీ లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, గుండోజి రఘు నందన్ చారి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, మున్నా, జూకంటి సురేష్ గౌడ్, అరవింద్ గౌడ్, కొప్పుల రాజు, తిమ్మని గిరేష్, ఒంగేటి అశ్విన్ రెడ్డి, ఎల్మటి సుమంత్ రెడ్డి, బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, అలాగే మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ బషీర్ బాగ్ విద్యుత్ అమరువీరుల ప్రాణత్యాగ ఫలితమే వామపక్ష నేతలు

మిర్యాలగూడ , ఆగస్టు 28:-( వార్త మిర్రర్) విద్యుత్ పోరాట అమరవీరుల వల్లనే నేడు ఉచిత విద్యుత్ ప్రజలు పొందుతూన్నారనిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బంటు వెంకటేశ్వర్లుఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య అన్నారు. బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతు చలో హైదరాబాద్ బషీర్బాగ్ ముగ్గురు అమరవీరుల బలిదానాలతో నేటికీ పాలక ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రజలందరికీ ఉచిత విద్యుత్తు అందిస్తున్నారని విద్యుత్ పోరాట అమరుల ప్రాణ త్యాగ ఫలితమేనన్నారు సమస్యలతో సతమవుతున్న ప్రజలు కదిలితే ఉద్యమం ఎలా ఉవ్వెత్తున ఎగిసిపడుతుందో చరిత్రలో నిలిచిన ఉద్యమమన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద కార్పోరేట్ విధానాలను కొనసాగిస్తుందని రాబోయే కాలంలో సరళీకరణ ఆర్థిక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో ప్రజలందరూ పెద్ద ఎత్తున ఉద్యమాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక గ్రామాలలో అనేక రకాల సమస్యలు పేరుకుపోయాయని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు నిర్మిస్తున్నామన్నారు. పాలకుల అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే



ప్రజా పోరాటాలలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీష్ చంద్ర, ఎం.రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, గాదే పద్మమ్మ, సిపిఐ నాయకులు బిల్లా కనకయ్య, కాశిమ్, కిరణ్, పిల్లుట్ల సైదులు, కరీమున్నీసా, అరుణ, కోడిరెక్క మల్లయ్య, మాధవరెడ్డి, కన్నేకంటి రామకృష్ణ ఉదయ్, పద్మ, మౌనిక, శమిమ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మండల కార్యాలయం, పంచాయితీల నోటీసు బోర్డుపై ముసాయిదా ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాల వివరాలు

### ఎంపిడిఒ శర్మ

మిర్యాలగూడ ఆగస్టు 28:-( వార్త మిర్రర్) తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 షెడ్యూల్ విడుదల నేపథ్యంలో గురువారం మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో, మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ప్రదర్శించినట్లు మిర్యాల ఎంపీడీఒ ఎం.శేషగిరిశర్మ తెలిపారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని మిర్యాలగూడ మండలంలో 65 అసెంబ్లీ పార్ట్ లోని 46 గ్రామపంచాయతీలలో 394 వార్డులలో 55,180 ఓటర్లతో ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీలలో, మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నోటీసు బోర్డు పైన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శించామని తెలిపారు. అదేవిధంగా 46 గ్రామపంచాయతీలకు వెంకటాద్రిపాలెం గ్రామపంచాయతీలో దుర్గా నగర్, సీత్యాతాండలో, నాన్యతాండ 48 ప్రదేశాలలో 394 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా మండల ప్రజా పరిషత్తు కార్యాలయం నోటీసు బోర్డుపై పెట్టా%శ్రీ%మన్నారు.మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల 30న పోలింగ్ స్టేషన్స్ ఏర్పాట్లు, ఓటర్ల జాబితా పైన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఒ ఎం.శేషగిరిశర్మ తెలిపారు. మండల రాజకీయ పార్టీల ప్రతినిధులుసమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు. ఈనెల 28 నుంచిఈనెల 30వరకుపోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, ఓటర్ల జాబితాపై ఏమైనా క్లైమ్స్, అభ్యంతరాలుంటే వ్రాతపూర్వకంగా తెలపాలన్నారు. ఈనెల 31న క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, సూచనలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న జాబితా జిల్లా ఎన్నికల అధికారులచే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ చేస్తారన్నారు.



## రైతులను హరిగోస పెడుతున్న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 28 .. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో యూరియా కోసం రైతులు బారులు తీరగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెంటనే స్పందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం %-% రెండు ప్రభుత్వాలు రైతులను హరిగోస పెడుతున్నాయి. రైతులు ఉదయం నుంచి యూరియా కోసం బారులు తీరుతున్నారు, చివరికి టోకెన్ల కోసం పోలీసుల చేతిలోనూ అవస్థలు పడుతున్నారు అన్నారు.రైతుల ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం జీరోక్స్ తీసుకొని స్లిప్ పద్ధతిలో యూరియాను ఇస్తున్నారు. మరోవైపు బ్లాక్ మార్కెట్‌లో యూరియాను అమ్ముతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ వాన చినుకులు పడగానే రైతు బంధు విడుదల చేసేవారు. ఇప్పుడు కేంద్రం%-%రాష్ట్రం వద్ద సరైన సమాచారం లేదు. రైతులను ఇంత ఇబ్బందులకు గురి చేయడం చాలా దురదృష్టకరం అని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాను అని సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్‌తో టెలిఫోన్‌లో మాట్లాడి తక్షణమే యూరియా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## తూప్రాన్ పేట కుమ్మరి సంఘం అధ్యక్షులుగా పూసుకూరి సాయిలు నియామకం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 28చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామంలో గ్రామ కుమ్మర సంఘం కమిటీని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్, కో కన్వీనర్లు తాడూరు వెంకటేష్, సిలివేరు వెంకటేష్, సిలివేరు నరేష్, తీగుళ్ల నరసింహ, అంజయ్య ల ఆధ్వర్యంలో బుధవారం గ్రామ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తూప్రాన్ పేట గ్రామ నూతన అధ్యక్షులుగా పూసుకూరి సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పూసుకూరి కుమార్, గౌరవ అధ్యక్షులుగా పూసుకురి సైదులు, ఉపాధ్యక్షులుగా పూసుకూరి పురుషోత్తం, కోశాధికారిగా రమేష్ లను ఎన్నుకోవడం జరిగిందని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్ తెలిపారు . ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. కుమ్మరి కులంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం చేస్తానని తెలిపారు. కుల సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన గ్రామ కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, యాదయ్య, మహేష్, అనసూయ తదితర గ్రామ కుమ్మరి కులస్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రి సమస్యల్ని పరిష్కరించాలి.

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు.ఎండి పాషా

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 28సిఐటియు జిల్లా కమిటీ పిలుపుమేరకు గురువారం రోజున సిఐటియు ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని ప్రభుత్వ ఆసుపత్రిని సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసీజీ మహిళ టెక్నీషియన్ లేకపోవడం వలన ఆసుపత్రికి వచ్చినటువంటి మహిళలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చౌటుప్పల్ లో పెద్ద పెద్ద కంపెనీలు ఉండడం వలన జాతీయ ప్రధాన రహదారి 65 వెంట జరిగిన రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వస్తే కెపాసిటీ తక్కువ ఉన్న అటువంటి ఎక్రే మిషన్ వల్ల ప్రమాదాలు జరిగిన పేద వాళ్లకు ఎక్రేలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. కనీసం షుగర్ పేషెంట్లకు ఇన్సులిన్, మరియు మందులు కూడా అందుబాటులో లేక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే జిల్లా ఆసుపత్రి అధికారులు స్పందించి చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, గడ్డం వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాలు...



మాదాపూర్ వార్త మిర్రర్ మిర్రర్ : మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓరిగంటి యాదయ్య, ఓరిగంటి రాజశేఖర్ , పొన్నాల అరుణ్ కుమార్ , శివ యాదవ్, ఓరిగంటి యశ్వంత్, ఓరుగంటి పవన్, సిదిరామ్ రాసా, షణ్ముఖ్ రాజా, గణేష్, కార్తీక్ తదితరాలు పాల్గొన్నారు.



## గణపతి పండుగ సందర్భంగా పద్మశాలి సంఘం యజ్ఞోపవితాలు,కండువాలు సమర్పణ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 28 .. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బాలాపూర్ మండల కేంద్రంలో...గణపతి పండుగ సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం అధ్యక్షులు మసున రవికుమార్,మహేశ్వరం మండలం శ్రీరామ్ కాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి 21 అడుగుల యజ్ఞోపవితం,కండువా సమర్పించారు. అనంతరం మన తెలంగాణ ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణేష్ స్వామివారికి 51 అడుగుల యజ్ఞోపవితం,కండువా సమర్పించడంతో పాటు,బాలా పూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి కమిటీ సభ్యులకు ఈ కానుకను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు జడ్పాటి ఆంజనేయులు,రమేష్ కటకం,శ్రీహరి,సాక నారాయణ,గుర్రం శ్రీనివాస్,చెట్లపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.అలాగే మార్కండేయ పద్మశాలి సంఘం నుండి భీమనపల్లి వెంకటేష్,కంది బిక్షపతి,అంకం జగన్,పున్న వంశీ,కిట్టు తదితరులు హాజరయ్యారు.



## వియన్ రెడ్డి సన్స్ షాపింగ్ మాల్ ప్రారంభించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 28 .. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో వియన్ రెడ్డి అండ్ సన్స్ షాపింగ్ మాల్ ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వియన్ రెడ్డి అండ్ సన్స్ షాపింగ్ మాల్ యజమానులను అభినందిస్తూ వ్యాపారం అభివృద్ధి చెంది స్థానిక ప్రజలకు ఉపయుక్తంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపార వర్గాలు తదితరులు పాల్గొన్నారు.




## నిండు గర్భిణీని జేసీపీ సహాయంతో బ్రిడ్జి దాటించిన రామాజీపేట యువత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 28

జగిత్యాల జిల్లా రాయికల్ మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు కుంటల నుండి వరద నీరు రోడ్డుపై పారడంతో వివిధ అవసరాల నిమిత్తం ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు, ఈ సమయంలో ఒడ్డె లింగాపూర్ గ్రామాని చెందిన గుగ్లావత్ కళ్యాణి పురిటి నొప్పులతో బాధపడుతూ వారి కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు ఫోన్ చేయగా రాయికల్ నుండి ఒడ్డె లింగాపూర్ కు వెళ్లే ప్రధాన రహదారి రామాజీపేట-భూపతిపూర్ మధ్యలో గల రోడ్డు డ్యామ్ పై వరద నీరు ప్రవాహంతో అంబులెన్స్ వెళ్లేదారి లేకపోవడంతో అక్కడే ఉన్న రామాజీపేట యువత తక్షణమే స్పందించి, జెసిబి సహాయంతో గర్భవతి నీ అంబులెన్స్ దగ్గరికి చేర్చి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర సమయంలో సహాయం చేసిన యువతకు కళ్యాణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాసమస్యల పరిష్కారంకై వచ్చేనెల సెప్టెంబర్ లో తహశీల్దార్ కార్యాలయం ముందు మహా ధర్నా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి పిలుపు




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 28 : మండల వ్యాప్తంగా ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని వచ్చే నెల సెప్టెంబర్ (1) న చౌటుప్పలమండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న మహా ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు సిపిఎం చౌటుప్పల మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షున జరుగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో పాలకపక్షం లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకపోయాయని అన్నారు. ప్రధానంగా మంచినీళ్లు, విద్యుత్తు, మురికి కాలువలు లాంటి సమస్యలు గ్రామాలలో పెద్ద ఎత్తున తిష్ట వేశాయని మొన్న పడిన వర్షాలకు రోడ్లకు గుంతలు ఏర్పడ్డాయని మండలంలో ఉన్న విషపూరితమైన కెమికల్ కంపెనీలతో వచ్చేవిష కాలుష్యంతో ఊపిరితిత్తులు గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు కాళ్ల నొప్పులు కీళ్ల నొప్పులతో అనేక రకంగా ఇబ్బంది పడుతున్న ప్రజలను పట్టించుకునే నాధుడే లేడని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించమంటే అప్పులు చేసి ఎంతకాలం పనులు చేపించాలని ఆవేదన పడుతున్నారని అన్నారు. గ్రామాల ఇంన్చార్జి అధికారులు పేరుకు తప్ప వారు గ్రామాలను సందర్శించే పరిస్థితి లేదని విమర్శించారు. మరో పక్క కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చారని ఒకటి రెండు తప్ప ఏ ఒక్కటి సరిగ్గా అమలు జరపలేదని అన్నారు. గ్రామాలలో పెన్షన్స్, అందరికీ ఇందిరమ్మ ఇల్లు, వ్యవసాయతర కుటుంబాలకు 12,500 రూపాయలు, దళితులకు అంబేద్కర్ పథకం, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు 2500 వందల ఆర్థిక సహకారం లాంటివి అమలు వేయడం లేదని అన్నారు. ఈ వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు కార్మికులు మహిళలు యువకులు , పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కృష్ణారెడ్డి కోరారు. ఇంకా సమావేశంలో మండల కార్యదర్శి గంగాదేవి సైదులు,మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, చింతల సుదర్శన్,బోయ యాదయ్య,మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్,చెరుకు లక్ష్మమ్మ, పల్లె మధు కృష్ణ, ఆదిమూలం నందీశ్వర్, జక్కిడి దేవేందర్ రెడ్డి,కొండే శ్రీశైలం, బోదాస్ వెంకటేష్, పాల్గొన్నారు.

## కాప్రా ప్రెస్ క్లబ్ లో ఘనంగా రెండవ రోజు వినాయక చవితి వేడుకలు

### పూజలో పాల్గొన్న భాగ్యనగర్ ఉత్సవ సమితి కన్వీనర్లు



కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు 28:కాప్రా ప్రెస్ క్లబ్‌లో రెండవ రోజు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా,ఏఎస్ రావు నగర్,చర్లపల్లి,మీర్పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ల భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్లు,సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.వినాయక చవితి ఉత్సవాల రెండో రోజు కాప్రా ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు,అర్చనలు జరిపారు. పూజలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా సర్కిల్ పరిధిలోని ముఖ్య నాయకులు,సభ్యులు,పాత్రికేయులు, స్థానికలు పాల్గొన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాధుని ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రతి ఇంటిలో,ప్రతి వాడలో,ప్రతి వీధిలో ఐక్యతకు ప్రతీకగా జరుపుకోవడం ఆనందదాయకం అని అన్నారు.గణనాధుని ఆరాధనతో సమాజంలో శాంతి,సౌభ్రాతృత్వం నెలకొంటాయి.మన పండుగలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే వేదికలుగా ఉండాలి.ముఖ్యంగా యువత ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలి.మట్టి గణపతులను ప్రతిష్టించడం,హరితహారం కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం సమాజానికి మేలు చేస్తుంది అని పిలుపునిచ్చారు.పండుగల ద్వారా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సానుకూల ఆలోచనలతో ముందుకు నడిపించడం మా లక్ష్యం అని తెలిపారు.ఈ పూజా కార్యక్రమంలో చల్లా ప్రభాకర్,నీరుకొండ సతీష్ బాబు,రేగిళ్ల సతీష్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,ఆనంద వంశరాజు,గగన్ కుమార్,ప్రెస్ క్లబ్ సభ్యులు బి.అశోక్,శనిగరం అశోక్,పటేల్ నర్సింహులు,హరి ప్రసాద్,శ్రీనివాస్ రావు,గంగికృష్ణ,రామచంద్రమూర్తి,నర్సింహా,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న డాక్టర్లపై చర్య తీసుకోవాలి.

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 28: చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా తనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో విషజ్వరాల బారిన పడి అనేకమంది రోగులు వస్తున్న డాక్టర్లు కనీసం వారిని థర్మామీటర్, బీపీ చెక్ అప్, ఏమి చేయకుండా వారు రాగానే. వారిని కరోనా పేషంట్ లాగా దూరం నిలబెట్టి మందులు రాసి పంపడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రోగులు వచ్చిన వారిని చూడకుండా టైం అయిపోయిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నారన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రైవేటు హాస్పిటల్ ను నిర్వహిస్తున్న డాక్టర్లపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాగణపతికి పూజలు

### గణేశుడు కర్తవ్య నిర్వహణ దీక్షుడు ౹గోల్లూరి శివానంద్ సాగర్

హయత్ నగర్ వార్తా మిర్రర్ ప్రతినిధి : హయత్ నగర్ శాంతినగర్ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విఘ్నేశ్వరుడి కరుణకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో గడపాలని యూత్ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా గోల్లూరి శివానంద సాగర్ మాట్లాడుతూ గణేశుడు కర్తవ్య నిర్వహణ దీక్షుడు. అమ్మకిచ్చిన మాట కోసం ఆది దేవుడిని సైతం ఎదిరించి కర్తవ్యం పాలనకు కట్టుబడ్డాడు అన్నారు ఈ కార్యక్రమంలో గోల్లూరి శివానంద్ సాగర్, జస్వంత్ రెడ్డి, మణికంఠ గౌడ్, రక్షిత్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మాధవ రెడ్డి, భరత్ రెడ్డి, క్రాంతి, హరి ప్రసాద్, వినయ్, సంతోష్, అజయ్ గౌడ్, తరుణ్, విజయ్ కుమార్ శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు కాలనీ ప్రజలు తదితరులు గణపతి పూజలో పాల్గొన్నారు

## మోదీ సర్కార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ!




కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ కోర్టు మెట్లెక్కింది. దేశంలోని ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ అయిన %ూా%23, గురువారం (ఆగస్టు 28) కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్-మనీ ఆధారిత గేమ్‌లపై నిషేధాన్ని సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ చట్టంపై సంతకం చేసిన తర్వాత ఈ చట్టానికి వ్యతిరేకంగా కోర్టులో దాఖలు చేసిన మొదటి పిటిషన్ ఇది.కంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ కోర్టు మెట్లెక్కింది. దేశంలోని ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ అయిన %ూా%23, గురువారం (ఆగస్టు 28) కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్-మనీ ఆధారిత గేమ్‌లపై నిషేధాన్ని సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ చట్టంపై సంతకం చేసిన తర్వాత ఈ చట్టానికి వ్యతిరేకంగా కోర్టులో దాఖలు చేసిన మొదటి పిటిషన్ ఇది. ఈ చట్టం ఏర్పడినప్పటి నుండి, అనేక ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పోటీలు అకస్మాత్తుగా ఆగిపోయాయి. ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ భవిష్యత్తు కూడా అనిశ్చితంగా మారింది.పార్లమెంటు ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు, 2025 ను ఆమోదించినప్పుడు రియల్-మనీ ఆన్‌లైన్ గేమింగ్ వ్యాపారం ఎదురుదెబ్బ తగిలింది. ఈ బిల్లు కింద, అన్ని రకాల డబ్బు ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించారు. మరోవైపు, ఇ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లను ప్రోత్సహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం పొందిన తర్వాత, ఈ బిల్లు ఇప్పుడు చట్టంగా మారింది. ఇటువంటి యాప్‌ల ద్వారా పెరుగుతున్న మాదకద్రవ్య వ్యసనం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల కేసులను అరికట్టడం దీని ముఖ్య ఉద్దేశ్యం. పార్లమెంటు బిల్లును ఆమోదించిన తర్వాత, -మద్దతు గల %ూశీనవతీదీఖుఓఱ% వంటి ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు తమ రియల్ మనీ గేమింగ్ ఆఫర్‌లను నిలిపివేసాయి.కర్ణాటక హైకోర్టులో 23 ఏం చెప్పింది..రాయిటర్స్ కథనం ప్రకారం, %ూా%23 అనేది రమ్మీ, పోకర్ వంటి ఆటలను ఆన్‌లైన్‌లో అందించే గేమింగ్ ప్లాట్‌ఫామ్. కర్ణాటక హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, %ూా%23, "ఈ చట్టం నైపుణ్యాల ఆధారంగా ఆన్‌లైన్ ఆటలను ఆడే చట్టబద్ధమైన వ్యాపారాన్ని నేర వర్గంలోకి తీసుకువస్తుంది. దీని కారణంగా, అనేక ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు రాత్రిపూట మూసివేయాల్సి రావచ్చు" అని పేర్కొంది. %ూా%23 తన పిటిషన్‌లో రాష్ట్రం యజమానిగా మారే మనస్తత్వం ఫలితంగా కొత్త చట్టం వచ్చిందని పేర్కొంది. ఈ చట్టం రమ్మీ, పోకర్ వంటి నైపుణ్య ఆటలకు వర్తింపజేశారు, దీనిని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేసును ఆగస్టు 30కి వాయిదా వేసింది. అయితే, ఈ విషయంపై ఐటీ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు.ఇదిలావుంటే,దేశంలో ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత తీవ్రంగా నష్టపోతోంది. ఎంతోమంది యువకులు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌లో డబ్బులు నష్టపోయి.. అప్పుల్లో కూరుకుపోయి చివరకు ప్రాణాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటివి ఎన్నో ఘటనలు కూడా చూశాం. అంతేకాదు పోలీసులు ఈ గేమింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలను సైతం విచారణ జరిపారు. అంటే ఈ గేమింగ్ యాప్‌ల ప్రభావం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త గేమింగ్ యాక్ట్‌ను తీసుకొస్తోంది. రియల్-మనీ గేమ్‌లను నిషేధించడం.. ఆన్‌లైన్ గేమింగ్‌ను నియంత్రించడానికి దోహదపడనుంది ఈ చట్టం. అదే సమయంలో %వ%-స్పోర్ట్స్, సోషల్ ఆన్‌లైన్ గేమింగ్ లోనూ ఆర్థిక వాటా లేకుండా చూసుకుంటుంది. డబ్బులతో కూడిన క్రికెట్ బెట్టింగ్ లాంటి స్కిల్ గేమ్స్‌తోపాటు.. పోకర్, రమ్మీ లాంటి చాన్స్ తీసుకునే ఆన్‌లైన్ ఆటలను ఎవరైనా ప్రమోట్ చేసినా%ఔ% ఆఫర్ చేసినా.. అందులో పెట్టుబడులు పెట్టినా ఇకపై జైలుకు వెళ్లక తప్పదు. అలాంటి ఆన్‌లైన్ ఆటల్లో అసలు ఆర్థిక లావాదేవీలు జరగకుండా బ్యాంకులు, పేమెంట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ప్రాసెసింగ్‌ను నిషేధిస్తారు. దీనివల్ల అసలు పేమెంట్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ ఈ నిబంధనలను పాటించకుండా ఎవరైనా అతిక్రమిస్తే 3 నుంచి 5ఏళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల వరకు జరిమానాలు ఉంటాయి. ప్రమోషన్ చేసే వారికి 2 ఏళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం..!